## ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు

**- ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర**

**నెల్లూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త – వైద్యం :** నరసింహకొండ ఆలయ మాజీ చైర్మన్ నెల్లూరు రూరల్ నియోజకవర్గం పొట్టెపాలెంకు చెందిన టీడీపీ నేత ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి ఆకస్మిక మరణం బాధాకరమని ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి ఎంతో శ్రమించారన్నారు. మంచి నాయకుడిగా, అభివృద్ధి కోసం తపించే నేతగా గుర్తింపు తెచ్చుకున్న ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి మృతితో తెలుగుదేశం పార్టీ ప్రజా నాయకుడిని కోల్పోయిందన్నారు. ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని తెలియజేశారు.

## సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి మృతి అత్యంత విషాధకరం

**నెల్లూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త –వైద్యం :** నెల్లూరు రూరల్ పరిధిలోని పొట్టేపాలెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, శ్రీ వేదగిరి నరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి గుండెపోటుతో మృతి చెందడం అత్యంత విషాధకరమని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్ పేర్కొన్నారు. రాజకీయాల్లో సుదీర్ఘకాలం క్రియాశీలకంగా పని చేసిన ఆయన ప్రజలకు అంకితభావంతో సేవలందించారని, గ్రామీణ ప్రాంత నాయకులతో ఆప్యాయ సంబంధాలు కొనసాగిస్తూ హుందాతరమైన రాజకీయాలకు ప్రతీకగా నిలిచారని కొనియాడారు. ఈ దుర్ఘటనతో తీవ్రంగా బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులకు , బంధువులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక సానుభూతిని తెలిపారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతిని చేకూర్చాలని, కుటుంబానికి ఈ విషాధాన్ని తట్టుకునే శక్తిని ఇవ్వాలని ప్రార్ధించారు.

## ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష సమావేశం



**ఉదయగిరి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ న్యాచురల్ ఫార్మింగ్ పథకంలో అమలు జరుగుతున్న వివిద కార్యక్ర మాలపై ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలో ఉన్న సీఆర్పీ కమ్యూనిటీ రిసోర్సు పర్సన్ పనితీరుపై సమీక్ష సమావేశం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే.కన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో ఉన్న మెడల్స్, మట్టి నమూనాలు సేకరణ గురించి అవగాహన కార్యక్రమం రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించి పెట్టుబడులు తగ్గించుకొనుటకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హెచ్‌ఆర్ఎంఎస్ లాగిన్ నందు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజనల్ టెక్నికల్ కోఆర్డినేటర్ రవిచంద్ర ప్రసాద్, ఏడీఏ చెన్నారెడ్డి, ఎన్ఎఫ్ఏ మల్లిఖార్జున్, టెక్నికల్ ట్రైనర్స్ రామ మోహన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ క్షేత్ర పరిశీలన చేశారు.

## టీడీపీ నేత ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి మృతి పట్ల సంతాపం తెలిపిన మంత్రి నారాయణ



**నెల్లూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త –వైద్యం :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పొట్టేపాలెంకు చెందిన టీడీపీ నేత, నరసింహకొండ ఆలయ మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి మృతి పట్ల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ది శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రగాఢ సంతాపం తెలిపారు. శ్రీనివాసులురెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపినట్లు మంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

## క్యాన్సర్ వ్యాధిని ప్రాధమిక దశలో గుర్తిస్తే నివారణ సులభం



**వింజమూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** క్యాన్సర్ వ్యాధిని ప్రాధమిక దశలోని గుర్తించినట్లయితే నివారించడం సులభంగా ఉంటుందని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు విశ్రాంత డీఎంహెచ్ఓ కే.మాశిలామణి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలు ఆహార అలవాటులను మార్చుకోకుండా పొగాకు ఉత్పత్తులను ఎక్కువగా వినియోగిస్తూ ఉండడంతో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం యువత కూడా ఈ పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడి క్యాన్సర్ వ్యాధి భారిన పడే పరిస్థితులు ఉన్నాయన్నారు. క్యాన్సర్‌ను మూడు దశలుగా నియంత్రించవచ్చని, మొదటి దశలో నియంత్రణ సులభంగా ఉంటుందని రెండవ దశ కష్టంగా ఉంటుందని, మూడవ దశలో అయితే చాలా క్లిష్టమైన పరిస్థితులు ఉంటాయని ప్రాణాన్ని కాపాడటం కూడా కష్టమేనని ఆయన తెలిపారు. కావున క్యాన్సర్ వ్యాధి చూపకుండా ఉండే విధంగా మన తగిన ఆహారపు అలవాట్లను మార్చుకుని పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. ఈ వ్యాధి నివారణకు పలు సూచనలు తెలిపారు. 9 నుండి 14 సంవత్సరాల పిల్లలకు హెచ్ఐవీ వ్యాక్సిన్ వర్క్ క్యాన్సర్‌కు హెపటైటిస్ బి వ్యాక్సిన్ ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. పలు ప్రభుత్వ వైద్యశాలలో ఈ వ్యాక్సిన్‌లను అందిస్తుందన్నారు. కావున యువత ముఖ్యంగా తన ఆహార అలవాట్లను మార్చుకుని పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్ మిడి కవర్ సీఈఓ జేసుదాసు, వైద్యశాల సిబ్బంది హెప్సిబా శాలిని, మల్లిఖార్జున, విజయ్, ప్రేమలీల, శాంతి, సుజిత్ తదితరులు ఉన్నారు.

## కంటి వెలుగును ప్రసాదించడమే వీపీఆర్ నేత్ర ఉద్దేశం




**వింజమూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** పేదలకు కంటి వెలుగును ప్రసాదించడమే ఉద్దేశంగా వీపీఆర్ ఫౌండేషన్ నేత్ర ఉద్దేశంగా ఉందని ఫౌండేషన్ కోఆర్డినేటర్ నేత్ర ఫ్రోగ్రాం ఇన్‌చార్జి ఎన్.శంకర్ తెలిపారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ నేత్ర వాహన వైద్య శిబిరాన్ని బుధవారం మండలంలోని శంఖవరం వెంకటాద్రిపాలెం గ్రామాలలో నిర్వహించారు. వీపీఆర్ ఫౌండేషన్ చీఫ్ కోఆర్డినేటర్ నేత్ర ఫ్రోగ్రాం ఇన్‌చార్జి ఎన్.శంకర్ పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరానికి సుమారు 230 మంది నేత్ర వ్యాధులు ఉన్న వారు హాజరయ్యారు. వారికి అధునాతన పరికరం ద్వారా పరీక్షలు జరిపి అవసరమైన 130 మందికి కళ్ళజోళ్లను అందించామని తెలి పారు. ముఖ్య అతిధులుగా మండల తెలుగుదేశం కన్వీనర్ గూడా నర్సారెడ్డి, వనిపెంట వెంకట సుబ్బారెడ్డి, భూమిరెడ్డి నరసింహారెడ్డి, భూమిరెడ్డి పెంచల్‌రెడ్డి, భోగిరెడ్డి వెంకటర మణారెడ్డిలు హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఈ ప్రాంత మెట్ట ప్రాంతం అని పేదరికంతో ఉందని ఉద్దేశంతో ఈ ప్రాంతం వాసులు కంటి సమస్యలతో సతమ తమవుతున్నారని గ్రహించి ఈ ప్రాంత వాసులకి కంటి వెలుగును ప్రసాదించాలనే ఉద్దేశంతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేదల సేవయే లక్ష్యంగా నేత్ర వాహనాన్ని సమకూర్చి ఉచితంగా కంటి సేవలు అందించేందుకు కృషి చేస్తున్నా రన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల పేద ప్రజలకు కంటి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. చల్లా శ్రీనివాసులు యాదవ్ మండల ఉపాధ్యక్షులు ఆనంగి రమణయ్య, కోడూరు నాగిరెడ్డి, భోగిరెడ్డి హజరత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బక్క పోలయ్య, కర్ణ శ్రీనివాసులు నాయుడు, బత్తుల అంబటి ఈశ్వర్‌రెడ్డి, మద్దూరు నాగేశ్వర్ రెడ్డి, దుద్దుగుంట శ్రీనివా సులురెడ్డి, మేడబలిమి రామచంద్ర, తిరుపతి ఆచారి, మల్లి అశోక్, ఉప్పు వెంకటేష్, తదితరులు హాజయ్యారు.

## మట్టి నమూనా పరీక్షలపై శిక్షణ



**వింజమూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా వింజమూరులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మట్టి నమూనా పరీక్షలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాలలోని రైతుల చేత ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసే విధంగా మట్టి నమూనాలు సేకరించాలని ఏపీ సీఎన్ఎఫ్ డీపీఎం కన్నయ్య తెలిపారు. బుధవారం వింజమూరులోని వ్యవసాయ సహాయ సంచాలకులు వారి కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు గ్రామీణ ప్రాంతాలలోని రైతుల పొలాలలో మట్టి నమూనాలు సేకరించాలన్నారు. ఈ మట్టి నమూనాలు సేకరించేందుకు వీఏఏల సహాయాన్ని తీసుకోవాలన్నారు. మండలంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. మట్టి నమూనాల పరీక్షలలో నిర్ధారితమైన లోపాలను వారికి తెలియజేసి లోపాలను సవరించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఈ కార్యక్రమంలో సహాయ సహకారాలు అందించాలన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు ముందుగా మట్టి నమూనాలను సేకరించి ఫలితాలు తెలియజేయాలన్నారు. 30 రకాల విత్తనాలతో రైతుల పొలాలలో పీఎండీఎస్ వేయించుటకు ప్రణాళికను సిద్దం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ రవిచంద్ర ప్రసాద్, ఏడీఏ శేషగిరిరావు, ఏవో వాసు, ఎన్ఎఫ్ఏ శ్రీనివాస్, తేజ, ఎంటి అంజన్‌రెడ్డి, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి ఏపీసీఎన్ఎఫ్‌లు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## 8న ఏపిజిఈఏ నెల్లూరు సిటీ యూనిట్ ఎన్నికలు



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం ఏపి జిఈఏ నెల్లూరు సిటీ యూనిట్ ఎన్నికలు ఈ నెల 8వ తేదీ ఆదివారం నాడు, స్థానిక రూరల్ మండల పరిషత్ కార్యాలయం నందు జరుపనున్నట్లు ఎన్నికల అధికారి వై దినేష్ రెడ్డి తెలిపారు. దినేష్ రెడ్డి ప్రస్తుతం ఏపిజి ఈఏ జిల్లా జాయింట్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 8వ తేదిన జరుగు ఏపిజిఈఏ సర్వ సభ్య సమావేశంతో పాటు నెల్లూరు సిటీ యూనిట్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సిటీ యూనిట్ పరిధిలోనికి చెందిన ఏపిజిఈఏ సంఘ సభ్యులు, అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు ఈ సమావేశానికి తప్పక హాజరై, వారి ప్రతినిధులను స్వేచ్ఛాయుత ప్రజా స్వామ్యధోరణిలో ఎన్నుకోవాలని సూచించారు. ఈ ఎన్నికలకు కోవూరు కార్యదర్శి ఎన్. చంద్రశేఖర్ రెడ్డి సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## వ్యవసాయ రంగంలో మరో విప్లవం

**– టాటా ర్యాలిస్ నుంచి ఫిప్లామ్ ప్రోడక్ట్ విడుదల– క్రిమి నియంత్రణలో కొత్త ప్రమాణం – టాటా ర్యాలిస్ ఫిప్లామ్**



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** నెల్లూరులోని శ్రీ లక్ష్మి శ్రీనివాస ఫంక్షన్ హాల్, అన్నమయ్య సర్కిల్ దగ్గర, నెల్లూరు దేశీయ వ్యవసాయ రంగంలో విశ్వసనీయమైన సంస్థగా పేరుగాంచిన టాటా ర్యాలిస్ ఇండియా లిమిటెడ్ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తన నూతన వ్యవసాయ ఉత్పత్తి ఫిప్లామ్‌ను అధికారికంగా మార్కెట్లోకి బుధవారం విడుదల చేసింది. ఫిప్లామ్ ఒక ఆధునిక క్రిమిసంహారక ఉత్పత్తిగా, పంటలకు హానికరమైన పురుగుల నుంచి సమర్థవంతంగా రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ ఉత్పత్తి ద్వారా రైతులకు అధిక దిగుబడులు, మెరుగైన పంట నాణ్యత మరియు స్థిరమైన వ్యవసాయం సాధ్యమవుతుందని సంస్థ పేర్కొంది. ఈ సందర్భంగా టాటా ర్యాలిస్ ఇండియా లిమిటెడ్ హెడ్ ఫీల్డ్ మార్కెటింగ్ వై.రవి కృష్ణ మాటాడుతూ రైతుల ఆదాయం పెరగాలనే లక్ష్యంతో, పరిశోధన ఆధారిత మరియు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్నామని, ఫిప్లామ్ ఉత్పత్తి పంటల రక్షణలో ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పుతుంది అని తెలిపారు. ఫిప్లామ్ ఉత్పత్తి వివిధ పంటలపై పరీక్షించబడినదిగా, సురక్షిత వినియోగానికి అనుకూలంగా రూపొం దించబడింది. త్వరలోనే ఈ ఉత్పత్తి అన్ని ప్రధాన వ్యవసాయ మార్కెట్లలో అందుబాటులోకి రానుంది. టాటా ర్యాలిస్ సంస్థ రైతుల భాగస్వామిగా నిలుస్తూ, భవిష్యత్తులో కూడా వినూత్న వ్యవసాయ పరిష్కారాలను అందించేందుకు కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టాటా ర్యాలిస్ ఇండియా లిమిటెడ్ తరుపున వెంకటరెడ్డి, డివిజినల్ సేల్స్ మేనేజర్, ఎస్‌కెఎం ఆరిఫ్, సిహెచ్ సుబ్బారావు రీజినల్ సేల్స్ మేనేజర్స్,ర్యాలిస్ సేల్స్ ఆఫీసర్స్, ఇతర సిబ్బంది, 150 మంది డీలర్లు పాల్గొన్నారు.

## నిరుపేద గిరిజన కుటుంబాలకు అవసర సామగ్రి పంపిణీ



**తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ సహకారంతో తాళ్లూరు జీవరత్నం, వెంకటరమణయ్య ఆధ్వర్యంలో మల్లికార్జునపురం గ్రామంలో నిరుపేద గిరిజన కుటుంబాలకు అవసరమైన రోజువారీ వినియోగ వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 70 మంది నిరుపేద గిరిజన కుటుంబాలకు ఇస్త్రీ పెట్టెలు, దుస్తులు కుట్టుకునేందుకు దారం, దంత మంజనాలు, దంత బ్రషులు, మహిళలకు అవసరమైన శానిటరీ న్యాప్కిన్లు, చిరుతిండ్లు తదితర సామగ్రిని అందించారు. ఒక్కో కుటుంబానికి సుమారు మూడు వేల రూపాయల విలువైన వస్తువులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ ఇరుగపోయిన శ్రీనివాస్ రావు, సంస్థ వ్యవస్థాపకురాలు చైతన్య జ్యోతి జయలక్ష్మి, గ్రామ పెద్దలు తాళ్లూరు వెంకటరమణయ్య, జీవరత్నం, ఇతర గ్రామ పెద్దలు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వీలుకానిపల్లి ఎస్‌టి కాలనీ, వెంకన్నపాలెం ఎస్‌టి కాలనీ, రవీంద్రపురం ఎస్‌టి కాలనీ, శివరాంపురం ఎస్‌టి కాలనీ, గణపతి నగర్ ఎస్‌టి కాలనీ, మల్లికార్జునపురం ఎస్సీ కాలనీల్లో గుడిసెల్లో నివసిస్తున్న మొత్తం 185 మంది నిరుపేద గిరిజనులకు కూడా ఈ సహాయ సామగ్రిని పంపిణీ చేశారు. నిరుపేదల జీవితాల్లో కొంతైనా ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## స్థలాలు కేటాయించాలని తహసీల్దార్‌కు వినతి



**తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** మండలంలోని మల్లికార్జునపురం గ్రామంలో ఇల్లు స్థలాలు లేని నిరుపేద కుటుంబాలకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో స్థలాలు కేటాయించాలని కోరుతూ గ్రామ టీడీపీ నేతలు బుధవారం తహసీల్దార్ సుధీర్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 43లో ఉన్న ప్రభుత్వ భూమిని నిరుపేదల నివాస అవసరాలకు వినియోగించాలని ఈ సందర్భంగా నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్‌కు అవసరమైన సూచనలు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుధీర్ మాట్లాడుతూ, స్థలం లేని నిరుపేద కుటుంబాలను గుర్తించి, ప్రభుత్వ నిబంధనలు, ఆదేశాల ప్రకారం ఇల్లు స్థలాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు తాళ్లూరు వెంకటరమణయ్య, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ లడ్డు విషయంలో క్లీన్‌చిట్ వచ్చినట్లు వైసీపీ వ్యవహరించడం దారుణం

**- కల్తీ నెయ్యి పేరుతో 233 కోట్లు అవినీతి**



**కోవూరు,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** కల్తీ లడ్డు విషయంలో క్లీన్‌చిట్ వచ్చినట్లు వైసీపీ వ్యవహరించడం దారుణమని జనసేన నియోజకవర్గ కేర్ టేకర్ సిహెచ్ శ్రీనివాసులురెడ్డి అన్నారు. కోవూరులోని జనసేన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసలు నెయ్యి లేకుండా పామాయిల్ రసాయనాలతో 233 కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. దేవుడంటే నమ్మకం లేని ధర్మకర్తల పాపాల వలనే ఈ ఘోరమైన కల్తీ జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసేందుకు వైసీపీ నాయకులు వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. భక్తుల విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీసిన ఈ అంశంపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. తిరుమల లడ్డులో కల్తీ నెయ్యి ఉందన్న విషయంపై రాష్ట్ర ప్రజల కోసం భగవంతుడా తప్పు జరిగిందని తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ పశ్చాత్తాప దీక్ష కూడా చేపట్టడం జరిగిందన్నారు. సిట్ కూడా లడ్డు విషయంలో కల్తీ జరిగిందని నిర్ధారించడం జరిగిందన్నారు. అసలు నెయ్యి లేని లడ్డులో కల్తీ ఎక్కడ జరిగిందని, కల్తీ జరగడం సహజమేనని ఆ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొనడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఏమి కావాలో తెలుసుకునేందుకు రాష్ట్ర అభివృద్ధి కోసం నిత్యం పాటుపడుతున్నారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు లడ్డు కల్తీ విషయంలో మాట్లాడకుండా ఉంటే అది వారికే మేలు అని ఈ సందర్భంగా హితవు చెప్పారు. అనంతరం ఈ లడ్డు కల్తీ విషయమై గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోఆర్డినేటర్ సీహెచ్ దిలీప్, జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి మన్నేపల్లి పవన్, మండల పార్టీ అధ్యక్షుడు అల్తాఫ్, బుచ్చి మండల పార్టీ అధ్యక్షుడు మాధవ్, రవీంద్ర, వంశీ, వినయ్, తన్మయ్, తదితరులు ఉన్నారు.

## మాజీ చైర్మన్ శివకుమార్‌ను పరామర్శ వీరి చలపతిరావు



**కొడవలూరు,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** మండలంలోని రేగడచెలిక గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు, తలమంచి సొసైటీ మాజీ చైర్మన్ దేవన బోయిన శివకుమార్ ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలు గాయపడడంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను వైకాపా రాష్ట్ర కార్యదర్శి వీరి చలపతిరావు పరామర్శించారు. ఆయనతోపాటు వైకాపా మండల అధ్యక్షులు చిమటా శేషగిరి, పేమ్మారెడ్డి పాలెం సర్పంచ్ వాల్పాపురం నవీన్, కోవూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు అనపల్లి ఉదయభాస్కర్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు జెడ్డా సాయికుమార్, యువజన విభాగం అధ్యక్షులు దేవన బోయిన నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్దాయి పోటీల్లో లుంబని విద్యార్ధుల ప్రతిభ




**చేజర్ల ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** అపస్మా ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో నిర్వహించిన జిల్లా స్దాయి ఎంఎంటిఎస్ఇ ప్రతిభా పరీక్షల్లో చేజర్లకు చెందిన లుంబిని విద్యా సంస్ద విద్యార్ధులు సత్తా చాటారు. ఈ పోటీలో లుంబిని పాఠశాల విద్యార్దిని హేమ తేజ ప్రతిభ కనబరచి జిల్లా స్దాయిలో తృతయస్దానం సాధించి అందరి మన్ననలు పొంది జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్దులు పాల్గొన్నా ఈ ప్రతిష్టాత్మక పరీక్షలలో హేమ తేజ సాధించిన విజయం లుంబిని విద్యా సంస్దకు గర్వకారణంగా నిలిచింది. విద్యార్దులలో దాగి వున్న ప్రతిభను వెలికి తీసేలా బోధన క్రమశిక్షణ నిరంతరం మార్గదర్శకత్వం అందిస్తున్న ఫలితమే, ఈ విజయం అని పాఠశాల యాజమాన్యం తెలిపింది, ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు బుధవారం హర్షం వ్యక్తం చేస్తు హేమ తేజను అభినందించారు.

## ఆర్ఎస్ఆర్ లో క్యాన్సర్ పై అవగాహన సదస్సు




**బిట్రగుంట ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** బోగోలు మండలం కడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరా మిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం వరల్డ్ క్యాన్సర్స్ డే ని పురస్కరించుకొని కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మరియు ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగం సంయుక్తంగా క్యాన్సర్ వ్యాధిపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించామని ప్రిన్సిపల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి నెల్లూరులో గల ప్రముఖ హాస్పిటల్ అయిన మెడికవర్లో ఆంకాలజీ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న ప్రముఖ డాక్టర్లైన డాక్టర్ మోనిక రెడ్డి. వై మరియు డాక్టర్ పునుగోటి గౌతమ్ పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. డాక్టర్లు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధినిర్ధారణకు ముందు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి, నివారణ ఎలా చేసుకోవాలి, వ్యాధిని పూర్తిగా నివారించుకోవడానికి ప్రస్తుతం భారతదేశంలో గల నివారణ సౌకర్యాలు గురించి విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ మెడికల్ సిబ్బందితో పాటు కళాశాల ఏవో ఆర్వి రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఏ కిరణ్ కుమార్, అన్ని విభాగాల అధిపతులు అధ్యాపకులు తదితరులు కూడా పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సారధ్యంలో రోడ్డు పనులు తువ్వర ప్రవీణ్ కుమార్



**కొడవలూరు,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** కొడవలూరు నుండి అల్లూరు వైపు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు అంతర్గతంగా ఏర్పడి ప్రజల నిత్య రాకపోకల కష్టాలను గుర్తించిన కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టినట్లు మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు తువ్వర ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనా ర్ధన్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే సారధ్యంలో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ప్రవీణ్ కుమార్ తెలియజేస్తూ ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## 12 సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి



**తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ తోటపల్లి గూడూరు మండల కమిటీ పిలుపునిచ్చింది. నరుకూరు సెంటర్‌లోని కామ్రేడ్ జక్కా వెంకయ్య స్మారక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన మండల సమావేశంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కే. మస్తానమ్మ, మారుబోయిన రాజా మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ ద్వారా 29 కార్మిక చట్టాలు రద్దు చేయబడటంతో కార్మికుల హక్కులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని వారు పేర్కొన్నారు. ఈ కోడ్స్‌కు వ్యతిరేకంగా అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, సంయుక్త కిసాన్ మోర్చాతో పాటు 520 సంఘాలు కలిసి ఫిబ్రవరి 12న సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్. మధుసూదనమ్మ మాట్లాడుతూ, కార్పొరేట్ ఒత్తిడితోనే కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తెచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆశా వర్కర్లకు కనీస వేతనం పెంపు రూ.26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో తోటపల్లి గూడూరు మండలంలోని అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాశిన పరశురామయ్య, ఆరణి గోపి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి మారుబోయిన వెంకటశేషయ్య, వరిగొండ పీఎస్సీ ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి రేణుకమ్మ, హేమ, ఆటో వర్కర్లు శివ, వెంకట శేషయ్య, ఆకుల రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఆనందోత్సాహాల మధ్య ఆదర్శ పాఠశాలవార్షికోత్సవం




**మర్రిపాడు ,ఫిబ్రవరి4,ప్రభాతవార్త:** మండలంలోని నందవరం పి.ఎం.శ్రీ ఆదర్శపాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మకూరు డివిజనల్ విద్యాశా ఖాధికారి జానకిరామ్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఆత్మకూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గంగాధర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులపై సెల్ ఫోన్, సోషల్ మీడియా ఎంతగానో ప్రభావితం చూపుతున్నాయని విద్యార్థులు వాటికి దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించి జీవితంలో గొప్పగా స్థిరపడాలన్నారు. డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ మహేంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువును మించిన ఆయుధం లేదని, దానిద్వారా ఏమైనా సాధించవచ్చన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రవికుమార్ ఆధ్వర్యంలో రూపొందించబడిన పాఠశాల మ్యాగజైన్‌ను అతిథుల చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు 6నుంచి12 తరగ తుల్లో విద్యాపరంగాను, హాజరు,వివిధ క్రీడా పోటీల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ లక్ష్మీనారాయణ, మండల విద్యాశాఖాధికారి ధనలక్ష్మి, మర్రిపాడు ఎస్ఐ కాసుల శ్రీనివాసులు, డిసిపల్లి టొబాకోబోర్డ్ సూపర్నెంట్ రాజశేఖర్, పొలిరెడ్డి పల్లి క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు మాస్తాన్, నందవరం ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, చిలకపాడు ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు మారుతి, కంపసముద్రం ఉన్నతపాఠశాల ప్రధానో పాధ్యా యుడు సుబ్బారెడ్డి, రీసోర్స్ ర్సన్ రాజేంద్రకుమార్,పాఠశాల ఉపాధ్యాయులు,అధ్యాపకులు,ఉపాధ్యా యేతర సిబ్బంది ,విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్రహారం రామాలయంలో చోరి



**కలువాయి ఫిబ్రవరి 4 ప్రభాతవార్త** మండలంలోని తోపుగుంట అగ్రహారంలోని రామాలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరి జరిగింది. అమ్మవారి మెడలో నాలుగు గ్రాములు బంగారు మంగళ సూత్రం,కేజి వెండి వస్తువులు హుండిలోని 20 వేల రూపాయాల నగదు అపహరణకు గురైయ్యాయి.బుధవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజిరి చోరి జరిగినట్లు గుర్తించి గ్రామస్తుల ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. కలువాయి ఎస్ఐ కోటయ్య సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్దలానికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలు స్వీకరించారు. ఇటీవల కాలంలో మండలంలో అనేక దేవాయాలలో వరస చోరిలు జరగడం భక్తులలో తీవ్ర ఆందోళన కలిస్తుంది.

## లబ్దిదారులకు పెరటి కోళ్ళు పంపిణి



**కలువాయి ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :** మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు స్దానిక వెలుగు కార్యాలయం నందు బుధవారం పెరటి కోళ్ళ పంపిణి కార్యక్రమాన్ని ఏపిఎం రవి ఆద్వర్యంలో నిర్వహించారు. మండలంలో వంద యూనిట్లు పెరటి కోళ్ళు అన్ని సంఘాల వారికి ఒక యూనిట్ విలువ 3 వేల 3 వందల రూపాయాలు చోప్పున అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద మహిళలకు ఆరోగ్య పరిరక్షణతోపాటు, పెరటి కోళ్ళ పెంపకాన్ని నిర్వహించేందుకు వారికి ఆదాయాన్ని సమకూరు స్తాయని ప్రస్తుతం కోళ్ళు డిమాండ్ వుండడం వల్ల పెరటి కోళ్ళు వారికి లబ్ది చేకూరుతుందని ఈకార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఏపిఎం రవి తెలిపారు. వెలుగు ఇఎలు లబ్దిదారులు సిబ్బంది పాల్గోన్నారు.

## మోహన్ బాబు, విష్ణులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

**– ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్ – సినిమాలలో కాదు నిజ జీవితంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు**



**గూడూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** విద్యార్థి సంఘ నేతలను కిడ్నాప్ చేసి నిర్బంధించిన సినీ నటులు మంచు మోహన్ బాబు, విష్ణులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు యాదాల సునీల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గూడూరు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అడిగినందుకు, తిరుపతి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ నాయకులను బౌన్సర్లు కిడ్నాప్ చేసి మోహన్ బాబు ఫామ్ హౌస్‌లో నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అన్నారు. మోహన్ బాబు సినిమాలకు మాత్రమే కలెక్షన్ కింగ్ కాదని విద్యార్థుల తల్లి దండ్రుల పట్ల కూడా కలెక్షన్ కింగ్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది విద్యార్థుల తల్లిదండ్రుల నుండి 27 కోట్ల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. ఈ ఏడాది కూడా అలాగే వసూలు చేస్తారని, కలెక్షన్ కింగ్ వసూళ్లను నిలువరించాలని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో కేసులు, సమస్యలు ఉన్న మోహన్ బాబు కళాశాల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సునీల్, ఏఐవైఎఫ్ నాయకులు కరిముల్లా, వెంకటేష్, చైతన్య రెడ్డి, ఏఐఎస్ఎఫ్ నాయకులు మోహన్, రిజ్వాన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా నాకా బంద్



**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** జిల్లా యస్.పి అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు మంగళవారం రాత్రి నాకా బంది నిర్వహించారు. నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, అసాంఘిక కార్యకలాపాలు అరికట్ట వేసేందుకు వాహనాలు తనిఖీ చేసి, అదేవిధంగా లాడ్జీలను ఆకస్మిక తనిఖీ నిర్వహించి, అక్కడ పరిస్థితులను పోలీస్ సిబ్బంది పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 51 లాడ్జీలను తనిఖీ చేసారు. అదేవిధంగా 1571 వాహనాలు తనిఖీ చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ 13, ఓపెన్ డ్రింకింగ్ 27, ఎంవి యాక్ట్ కేసులు 121 నమోదు చేసి రూ.73,345 ఫైన్ విధించారు. జిల్లాలో అన్ని కూడళ్ళు, హైవే, ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాలలో విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్‌లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఆటో సైడ్ సిట్టింగ్, డెఫెక్టివ్ నంబర్ ప్లేట్స్, అనధికార పార్కింగ్ తదితర ఉల్లంఘనలకు జరిమానాలు విధించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు తావిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. లాడ్జీల్లో పోలీసులు ప్రతీ గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, రాత్రి వేళల్లో లాడ్జీలులో బస చేసిన వ్యక్తులను ప్రశ్నిస్తూ, వారి వివరాలపై ఆరా తీశారు. అనుమానాస్పద వ్యక్తులను చెక్ చేసి వారి వేలి ముద్రలు తీసుకుంటూ, నేరములు జరుగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను యాజమా న్యా లకు తెలియజేసారు.ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు గురించి సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ, డయల్ 112కు గానీ తెలియచేయాలని ప్రజలకు సూచించారు.

## రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలి



**కోట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** రైతులు తమ పంటను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుచేం ద్రప్రసాద్‌కోరారు.బుధవారం మండల పరిధిలోని చిట్టేడు ,రుద్రవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ-క్రాప్ చేయించుకుంటేనే ప్రభుత్వం ద్వారా సబ్సిడీలు, ఇతర వ్యవసాయ పథకాలు అందుతాయని తెలిపారు. చివరకు రైతులు పండించిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే ఈ-క్రాస్ అవసరమని తెలిపారు. ప్రస్తుతం ధాన్యం పుట్టి ధర రూ.20,321 ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి సాయి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## బీసీవై పార్టీ జిల్లా బాధ్యతలు అందుకున్న బాలాజీ



**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ చేతుల మీదుగా విజయవాడలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో నెల్లూరు జిల్లా బీసీవై పార్టీ జిల్లా కన్వీనర్‌గా నియామక పత్రాన్ని బుధవరపు బాలాజీ అందుకున్నారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుల ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లాలో బీసీవై పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి జిల్లాలో పార్టీ ప్రతి బీసీ కుటుంబానికి చేరే విధంగా తన యొక్క కృషి చేస్తానని అందరు సహకారంతో అందరిని కలుపుకొని పార్టీ శ్రేయస్సు కోసం పని చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసి సభ్యులు ఎస్ ఎస్ యాదవ్, ఈసీ మెంబర్లు ఏల్చూల రామ్మోహన్, నక్క దినేష్, సోమ గోపాల్, రాష్ట్ర యువత కో కన్వీనర్ లీలకృష్ణ యాదవ్, జిల్లా యువత కన్వీనర్ పామూరు హరినాథ్, కో కన్వీనర్ కొణిదెల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు ప్రారంభమైన కొమ్మరపూడి ఎత్తిపోతల పథకం



**నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ మండలం కొమ్మరపూడి సాగునీటి ఎత్తిపోతల పథకం పనులు గత కొన్నేళ్లుగా ఆగిపోయిన వైనం అందరికి తెలిసిందే. ఎంతో సదుద్దేశంతో పెన్నానది నీటిని గ్రామంలోని రెండు చెరువులకు అందించే క్రమంలో చేపట్టిన ఈ పథకం ఆదిలోనే హంస పాదులా, నిర్లక్ష్యానికి గురై ఐదేళ్ల కాలంగా నత్తనడకన సాగుతోంది. గత మూడేళ్ల క్రితం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ దాదాపు సగం పనులు పూర్తి చేసి పత్తా లేకుండా పోవడంతో ఈ పథకానికి గ్రహణం పట్టింది. గత ప్రభుత్వ కాలంలో నిధులు కొరతతో ఈ పనులు ఆగిపోయినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ పథకం పూర్తి అయితే గ్రామంలోని బీడు పొలాలు కూడా సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉంది. ఎట్టకేలకు కొమ్మరపూడికి సాగునీరు అందించే ఎత్తిపోతల పథకం పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. దీంతో గ్రామంలోని రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చొరవతోనే ఈ పనులు పున:ప్రారంభమయ్యాయి.

## ఎరువుల దుకాణాలు తనిఖీ చేసిన ఏఓ

**కోట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** కోటలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఏ ఎరువులను అడుగుతారో వాటిని మాత్రమే దుకాణదారులు ఇవ్వాలని సూచించారు. ఒక రకం ఎరువులను రైతులు కొనుగోలు చేస్తే మరో రకం ఎరువును కూడా తీసుకోవాలని రైతులను బలవంతం చేస్తే అటువంటి దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా రైతులను ఇబ్బందులకు గురిచేస్తే విచారించి దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తామన్నారు.

## స్మశాన వాటికలో బోరుకు ప్లాట్ఫామ్ ఏర్పాటు



**బిట్రగుంట ఫిబ్రవరి 4, ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామి పాలెం గ్రామంలో హిందూ స్మశాన వాటికలో బోరింగ్ రిపేరు చేసి ఎనిమిది నెలలు అయినా దానికి సంబంధించిన ఇంతవరకు ప్లాట్ ఫారం నిర్మించక పోవడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగా మంగళవారం ప్లాట్ఫామ్ ఏర్పాటు చేశారు అని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తల రవిచంద్ర తెలిపారు. ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయడంలో శ్రద్ధ కనపరిచిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



**కోట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** మారిన ఆహారపు అల వాట్లు, వాతావరణ పరిస్థితులు, జీవనశైలి, ఇత ర కారణాల వలన ప్రజలు క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందని చిట్టేడు ఆరోగ్య ఉపకేంద్రం డాక్టర్ నాగరాజు అన్నారు. బుధవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా చిట్టేడులో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి, చికిత్స తీసుకుంటే నయమవుతుందన్నారు. ప్రస్తుతం అత్యాధునిక చికిత్స అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ప్రభుత్వాసుపత్రులకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విసిఆర్‌కు కమిటీ పత్రాలు అందజేసిన నేతలు



**కొడవలూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ, అనుబంధ సంఘాల కమిటీలను రామన్నపాలెం,మిక్కిలింపేట,నార్తరాజు పాలెం ,పెమ్మారెడ్డి పాలెం గ్రామపంచాయతీలో వైకా పా నేతలు పూర్తి చేసిన పత్రాలను వి సి ఆర్ అతిథి గృహం ఆవరణం పార్టీ కార్యాలయంలో వైకాపా రాష్ట్ర కార్యదర్శి వీరి చలపతిరావుకు ఆయా గ్రామా నాయకులు కాకి సుమ న్, కరేటి శ్యామ్ సుందర్ రెడ్డి,మాణిక్యరావు, జూటూరు వెంకట కృష్ణారెడ్డి, మల్లికార్జున్, వాల్పాపురం నవీన్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిమటా శేషగిరి, జెడ్డా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కల్లాలకు భూమి గుర్తింపు




**కొడవలూరు ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** మండలంలోని రైతులు వరి పంట పొలాలు సాగు చేసుకుంటు ధాన్యం అమ్మకాలు చేస్తున్న రైతుల కోసం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు భాగంగా మానేగు ంటపాడు గ్రామంలో ఎకరం భూమిని గుర్తించినట్లు తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భ ంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారులు ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కల్లాలు ఏర్పాటు కొరకు కొంత భూమిని గుర్తించడం జరిగిందని ఆమె అన్నారు.

## ఈ-పంట నమోదు రైతులకు ఉపయోగకరం




**కోవూరు,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** రైతులు ఈ-పంట నమోదు చేసుకోవడం వలన అది వారికే ఎంతో ఉపయోగకరమని మండల వ్యవసాయాధికారిణి టి. రజని అన్నారు. కోవూరు మండలం పాటూరు , కోవూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎరువులు, పురుగుమందులు వాడే విషయంలో వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలన్నారు. రైతులు వాటిని ఇష్టానుసారంగా వాడడం వలన మిత్ర పురుగులు కూడా నశించే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సాగు ఖర్చులు తగ్గించి దిగుబడి పెంచుకునేలా రైతులు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శిరీష, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రభ, చందన, తదితరులు ఉన్నారు.

## లడ్డులో కల్తీనెయ్యి వినియోగించిన విషయం వాస్తవం



**కావలి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి పవిత్ర ప్రసాదమైన లడ్డూ తయారీలో వైసిపి పాలన కాలంలో కల్తీనెయ్యి వినియోగించిన విషయం నూటికి నూరు శాతం వాస్తవమని సిట్ దర్యాప్తులో నెయ్యిలో హానికరమైన రసాయనాలు ఉన్నట్లు తేలిందని జనసేన నాయకులు స్పష్టం చేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పట్టణ అధ్యక్షులు పోబ్బసాయి, అధికార ప్రతినిధి రిషికేష్, వీర మహిళ కందుల కవిత, అల్లూరు మండల అధ్యక్షులు కార్తీక్‌శర్మ, మత్స్యకార రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. ఆవుపాలతో తయారైన స్వచ్ఛమైన నెయ్యి కాకుండా పూర్తిగా కెమికల్స్ తో తయారైన పదార్థాన్ని నెయ్యిగా సరఫరా చేసి కోట్ల రుపాయల దోపిడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూలో కల్తీ లేదని సిట్ తెలిపిందని ఈ విషయంలో పవన్‌కళాణ్ క్షమాపణ చెప్పాలంటూ పిచ్చిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసలు నెయ్యి అని చెప్పి రసాయనాలతో తయారైన పదార్థాన్ని సరఫరా చేసి దేవాదిదేవుడైన శ్రీ వెంకటేశ్వర స్వామివారి భక్తులను మోసం చేసిన దోపిడిలో పాల్గొన్న వారిని తక్షణమే అరెసుట చేసి కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి రథం దగ్ధమైన సందర్భంలో కావలి ఎమ్మెల్యే ఏమైనా క్షమాపణ చెప్పాడా అని వారు ప్రశ్నించారు. ఇకపై మా నాయకులు పవన్ కళ్యాణ్ జోలికి వస్తే సహించేది లేదని వైసిపి నాయకులకు గట్టి హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లకొండ మస్తాన్, డాక్టర్ రవి. కత్తి అనీల్ బాబాయ్, ప్రకాష్, శివ, సాధు, శ్రీధర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేలు మరింత వేగవంతం కావాలి



**కోవూరు,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** ప్రభుత్వం ఇచ్చిన ఎఫ్ఎస్ సర్వేపై గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక దృష్టి పెట్టి వీటిని సకాలంలో పూర్తి చేసేలా తగు చొరవ డిప్యూటీ ఎంపీడీవో సురేష్ అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు ఒకటవ సచివా లయా లన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు వారికి ఇచ్చిన విధులు బాధ్యతలను పారదర్శకంగా నిర్వహించేలా దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.

## ఆత్మీయుడు పొట్టేపాలెం శీనయ్య ఆకస్మిక మృతి పట్ల మంత్రి ఆనం సంతాపం



**నెల్లూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త – వైద్యం :** తెలుగదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీవేదగిరి నరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గా పొట్టేపాలెం మాజీ సర్పంచ్‌గా ఆనం కుటుంబానికి అత్యంత ఆత్మీ యుడుగా సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి ఆకస్మిక మీతి మృతి పట్ల మంత్రి ఆనం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోటప్పకొండలో అధికా రిక కార్యక్రమాల దృష్ట్యా.. మత్రి ఆనం వారి కుటుంబ సభ్యులకు కుమారుడు అచ్యుత్‌రెడ్డికి స్వయంగా ఫోన్ చేసి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని మంత్రి ఆనం పేర్కొన్నారు.

## నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



**బిట్రగుంట ఫిబ్రవరి 4, ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలో మెయిన్ రోడ్ క్రాసింగ్ పెట్రోలు బంకు, కొయ్యల మిల్ దగ్గర 11 రీజుకెవి బోగోలు టౌన్ ఫీడర్ లో బుధవారం నూతన 9.1 మీటర్ల స్తంభాలు వేసి ఎత్తు పెంచినట్లు ట్రాన్స్కో ఏ ఈ జడరాయ తెలిపారు.. అదేవిధంగా బోగోలు టౌన్ ఫీడర్ లో ఆర్ సి ఎం స్కూల్ నుండి చెంచులక్ష్మి ్మ పురం సబ్ స్టేషన్ వరకు, బృందావనం,అరవపాలెం వెనుక ఉన్న 11కేవీ లైన్ బోగోలు టౌన్ ఫీడర్ లో లాంగ్ స్పాన్స్, పొట్టి స్తంభాలు ఉన్న చోట 20 నూతన 9.1 మీటర్ల స్తంభాలు వేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

## రాయలసీమకు సీఎం చంద్రబాబు తీరని అన్యాయం

**– తెలంగాణ ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో గుట్టు రట్టు**



**కోవూరు,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రయోజనాలను ప్రధానంగా రాయలసీమ నెల్లూరు, ప్రకాశం జిల్లాల భవిష్యత్తును ఈ కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీరి చలపతిరావు పేర్కొన్నారు. కోవూరులోని వైసీపీ కార్యాలయంలో బుధవారం ఛలో పోతిరెడ్డిపాడు గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనలతో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును అడ్డుకునేందుకు జరుగుతున్న కుట్రలను నిరసిస్తూ గురువారం భారీ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నాట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసలు రంగును బయటపెట్టాయన్నారు. క్లోజ్ డోర్ మీటింగ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని ఒప్పించి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఆపించగలిగామని రేవంత్‌రెడ్డి చెప్పడం దీనికి నిదర్శనమన్నారు. చంద్రబాబు స్వార్థ రాజకీయాల కారణంగా రానున్న రోజుల్లో నెల్లూరు జిల్లాలో తాగు, సాగు నీటికి తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని, కేవలం కక్షసాధింపు కారణంగానే ఈ పనులు ఆపింఏయడం దుర్మార్గమన్నారు. గతంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞం ద్వారా పోతిరెడ్డిపాడు ఎత్తును పెంచి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రాజెక్టును పూర్తి చేస్తుంటే చంద్రబాబు అడ్డుకుని చరిత్రహీనుడిగా మిగిలిపోయారన్నారు. గతంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించాలని చూస్తే వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణతో ప్రభుత్వం ఎలాగైతే వెనక్కి తగ్గిందో ఇప్పుడు పోతిరెడ్డిపాడు విషయంలోనూ అదే స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. రానున్నది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. గురువారం చేపట్టబోయే నిరసన ర్యాలీలో పార్టీ శ్రేణులు, కోఆర్డినేటర్లు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొనాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ కన్వీనర్ కొండూరు అనిల్‌బాబు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డిలు ప్రసంగించారు. ఈ సందర్భంగా గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి, యాక్టివ్ కార్యదర్శి సుబ్బారెడ్డి, పార్టీ కన్వీనర్లు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సర్పంచ్‌లు లక్ష్మీకుమారి, ప్రమీలమ్మ, పార్టీ సీనియర్ నాయకులు ఆదినారాయణరెడ్డి, మందా రవి, చిరంజీవి, ప్రసాద్, మహేష్, విజయసేనారెడ్డి, మోషా, పెద్ద సంఖ్యలో నేతలు ఉన్నారు.

## ఫలితాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** పదవ తరగతి విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగితే తప్పక వస్తాయని ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ బాలికోన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు వంద రోజుల కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయురాలు షాహినా పర్వీన్ 170 మంది విద్యా ర్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతిలో 590 మార్కులు సాధిస్తే పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ అకాడమి అధ్యక్ష, కార్యదర్శులు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, డాక్టర్ పచ్చిపాల మల్లికార్జునరెడ్డిలే 2 లక్షల రూపాయలను ప్రోత్సాహక బహుమతిగా అందజేస్తారని, దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు సాధించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు షాహినా పర్వీన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

## రాపూరులో ఎన్‌హెచ్ 565పై సెంట్రల్ లైటింగ్ ట్రైల్ రన్

### పట్టపగలులా రాపూరు రోడ్డు



**రాపూరు,ఫిబ్రవరి04ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులో జాతియ రహదారి 565 రోడ్డుపై హెచ్‌పి పెట్రోలు ముందు నుండి పంచాయితీ కార్యలయం వరకు ఎన్‌హెచ్ అధికారులు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుదవారం సాయంత్రం ఇందులో హెచ్‌పి పెట్రోలు బంకు ముందు నుండి ఆటో స్టాండ్ వరకు ఏర్పాటు చేసిన లైట్లను వేసి ట్రైల్ రన్ చేశారు. ఏర్పాటు చేసిన అన్ని లైట్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వెలుగుతున్నాయా లేదా అని పరిశీలించారు. లైట్లు వేయడంతో ఎప్పుడూ చికటిగా వుండే రాపూరు రోడ్డు ఒక్కసారిగా పట్టపగలులా కాంతులు విరజిమ్ముతూ వుంది. దీంతో పట్టణంలోని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పుడు ఎమ్మెల్యేగా కురుగోండ్ల రామకృష్ణ వున్న సమయంలో అనుమతులు పోందిన ఈ రహదారి నిర్మాణం పూర్తి చేసుకోని మరలా తెలుగుదేశం ప్రభుత్వ సమయంలో ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ చేతుల మీదుగా త్వరలో రాపూరులో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం కానున్న సందర్భంగా పట్టణంలోని ప్రజలు ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణకు ధన్యవాదాలు తెలుపుతున్నారు. అయితే ఈ సెంట్రల్ లైటింగ్‌ను మద్దెలమడుగు నుండి పాత ఆర్ అండ్ బి బంగ్లా వరకు ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ జాతియ రహదారుల అధికారులతో మాట్లాడి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి విదంగా చేయాలని కోరుతున్నారు.

## జువ్వలదిన్నెలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఏర్పాటుకు సన్నాహాలు



**బిట్రగుంట ఫిబ్రవరి 4, ప్రభాతవార్త** బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామంలో నూతనంగా బ్యాంకు ఆఫ్ బరోడా శాఖ ను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు బుధవారం సన్నాహాలు ప్రారంభిం చారు. అందుకు సంబంధించి లబ్ధిదారులు నుండి నూతన అకౌంట్లు ప్రారంభించేందుకు సంబంధిత సిబ్బంది ప్రక్రి య చేపట్టారు.

## ఉగాదినాటికి 5లక్షల ఇళ్ళు పూర్తి ఇఇ మోహన్‌రావు



**సంగం ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** ఉగాదినాటికి రాష్ట్రంలో 5 లక్షల ఇళ్ళు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇఇ మోహన్‌రావు తెలిపారు. సంగం మండలంలో పలు కాలనీలు పరిశీలించిన సందర్భంగా ఆయన సంగంలోని జగనన్న కాలనీల పరిశీలన నిర్మాణ నాణ్యత మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో " ఆప్షన్ 3 కింద" కాంట్రాక్టర్లు నిర్మించిన ఇండ్లలలో నాణ్యతా లోపాలు ఉన్నట్లు ఫిర్యాదులు అందడంతో క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనీకిలు నిర్వహించి నాణ్యతలేని 6,980 ఇళ్ళను గుర్తించడం జరిగిందని అన్నారు. ఈ పనులకు సంబందించి 141 ఏజన్సీలను బాద్యులుగా గుర్తించారు. అందులో 67 ఏజన్సీలు పనులు సరిచేయడానికి ముందుకు రావడం లేదని అన్నారు. అటువంటి వారిపై పోలీసు కేసులు నమోదు చేసి వారి నుండి రికవరీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. జిల్లాలో 20,468 ఇళ్ళను పూర్తి చేయడానికి అధికారులు వేగంగా పనులు చేస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆవాస్ ప్లస్ కింద మరో 6 వేల ఇళ్ళకు సంబందించి సర్వే పూర్తి అయిందని చెప్పారు. ఈనెల 13 వ తేదిలోపు వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.ఈకార్యక్రమంలో ఆయన వెంట హౌసింగ్ ఏఇ గౌస్‌మోహుద్దీన్ ఉన్నారు.

## పి-4 స్ఫూర్తితో దివ్యాంగుడికి భరసా కల్పించిన సంయుక్త



**కావలి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** కావలి తుఫాన్ నగర్ కొత్త శివాలయం దగ్గర రోడ్డు పక్కన పూరిపాకలో నివాసం ఉంటున్న దివ్యాంగుడు గోచిపాతల శ్రీనివాసులుని పి4స్ఫూర్తితో సంయుక్త సేవాసంస్త దత్తత తీసుకొని భోరసా కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ ప్రమాదం కారణంగా కొన్ని సంవత్సరాలుగా మంచానికి పరిమితమైన శ్రీనివాసులుకి గత ఎనిమిది సంవత్సరాలుగా సహాయ సహకారాలు అందజేస్తూ ఉన్నామని తెలిపారు. వారి జీవనానికి అవసరమైన నిత్యవసర వస్తువులను సంయుక్త సేవా సంస్థ ద్వారా అందజేస్తూనే ఉన్నామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం దివ్యాంగులకు సంబంధించిన పరీక్షలు మరోసారి చేయించుకోవాలనే ఆదేశాలు ఇవ్వడంతో కావలి నుంచి నెల్లూరు వెళ్ళి పరీక్షలు చేయించుకునేందుకు నగదు లేక పోవడంతో తమ యొక్క సంస్థ ద్వారా అంబులెన్స్ ఏర్పాటు చేయమని దివ్యాంగుడు శ్రీనివాసులు కోరడంతో బుధవారం తమ సంస్థ సభ్యుల సహకారంతో అంబులెన్స్ ఏర్పాటు చేసి వైద్య పరీక్షల నిమిత్తం నెల్లూరుకు పంపించడం జరిగిందని తదెలిపారు. రాబోయే రోజుల్లో శ్రీనివాసులుకి మరింతగా సేవలు అందిస్తామని తెలిపారు. సహాయం అందజేసిన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్రకు, సంస్థ సభ్యులకు రుణపడి ఉంటానని దివ్యాంగుడు శ్రీనివాసులు తెలిపారు.

## చలో అమరావతిని విజయవంతం చేయండి సోమశిలప్రాజెక్ట్ వైస్ చైర్మన్



**జలదంకి,ఫిబ్రవరి4, ప్రభాతవార్త** మరావతిలో గురువారం జరిగే మన నీరు మన భవిష్యత్ సాగునీటి సంఘాలపాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సోమశిలప్రాజెక్ట్ వైస్ చైర్మన్ పులిగుంట మధుమోహన్‌రెడ్డి పిలుప ునిచ్చాడు. బుదవారం ఆయన జలదంకిలో మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి అద్యక్షతన కార్యక్రమం జరుగుతుందని కావున ఉదయగిరి నియోజకవర్గంలోని సాగు నీటి సంఘాల అద్యక్షులు,ఉపాద్యక్షులు వారి మండలాల లోకేటాయించిన బస్‌ళలలో తరలిరా వాలని ఆయన విజ్ఞప్తిచేశాడు.

## పొలాల డొంక మరమ్మతులకు ఎమ్మెల్యే 2లక్షలు సహకారం



**విడవలూరు,ఫిబ్రవరి4 ప్రభాతవార్త :** విడవలూరు గ్రామం మలిదేవి డ్రైన్ ఆవరణంలో పొలాలకు వెళ్లే డొంక మరమ్మత్తుల ఏర్పాటు కోసం కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి 2 లక్షల రూపాయలు విరాళంగా అందజేసినట్లు కోవూరు ఏఎంసీ మాజీ చైర్మన్ పూండ్ల అచ్యుత రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డొంక వైపు సుమారు 150 మంది రైతులు పొలాలను సాగు చేసుకుంటున్నారు. మరమ్మతులకు గురైన డొంకకు కొన్నిచోట్ల తూములు ఏర్పాటు చేయడం జరుగుతుంది. వరి కోతలు పూర్తయిన తర్వాత డొంకకు గ్రావెల్ తరలిస్తామన్నారు. ఇటీవల ఎమ్మెల్యే జాన్ పేట నుండి సుమారు మూడు కిలోమీటర్ల వరకు పంట కాలువలకు కూడిక తీయడం జరిగిందని ఆయన అన్నారు. రైతులు అభివృద్ధి కోసం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి రైతులు మంచాల విజయ్ కుమార్, పిడుగు రవి, గోళ్ళ సదానందం లు కృతజ్ఞతలు తెలిపారు.

## ఛాంపియన్ ఫార్మర్ పొలాలను పరిశీలన ఆత్మ పిడి శారద



**విడవలూరు,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** మండలంలోని ఊటుకూరు,విడవలూరు గ్రామాలలో పొలం పిలుస్తుంది, రైతు పొలంబడి కార్యక్రమంలో ముఖ్యఅతిథి ఆత్మ పిడి శారద పాల్గొన్నారు. ఊటుకూరు గ్రామంలోని వేరుశనగ పొలాలను సాగు చేసిన చాంపియన్ ఫార్మర్ రైతు సిద్ది .కాంతారావు పొలాన్ని పరిశీలించి వేరుశనగ పంటలో ఎర పంటలు, రక్షక పంటలు, లింగాకర్షణ బుట్టల యొక్క ఆవశ్యకతను రైతులకు తెలియపరిచి వాటి యొక్క పనితీరు వివరించారు. అలాగే విడవలూరు గ్రామంలోని దేవుళ్ల శ్రీనివాసులు రెడ్డి చాంపియన్ ఫార్మర్ పొలంలో నాటిన నూతన వరి వంగడాలను పరిశీలన చేశారు కోవూరు ఏడిఏ జి.అనిత ఈ పంట నమోదు రైతులే స్వయంగా ఏపీ ఏఐఎంఎస్ 2.0 మొబైల్ యాప్ ద్వారా చేసుకోవచ్చని రైతులకు తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా పంట నమోదు చేసేటప్పుడు రైతుకి పంట నమోదు ముందు, పంట నమోదు చేసిన తర్వాత మరియు ఈ కేవైసీ అపుడు మెసేజ్ లు వస్తాయని రైతులు వివరాలు సరి చేసుకోవాలని ఆమె అన్నారు. రైతులందరూ కూడా తప్పనిసరిగా సంబంధిత ఆర్ఎస్కే లలో వి ఏ ఏ లను సంప్రదించి పొలం యొక్క వివరాలను పంట నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఏఓ సిహెచ్. శ్రీలక్ష్మి ్మ, వి ఏ ఏ పి.ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

## పోటీపరిక్షల్లో శాంతినికేతన్ విద్యార్థిని ప్రతిభ




**అనంతసాగరం,ఫిబ్రవరి4,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అనంతసాగరంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని వి.లౌక్య జిల్లాస్థాయిలో 3వస్థానంలో నిలిచిందని పాఠశాల కరస్పాండెంట్ గోలిప్రభాకర్, డైరెక్టర్ పాపిశెట్టి నర్సింహులు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరులో నిర్వహించిన ఎంఎంటిఎస్ఇ జిల్లా స్థాయి పోటీ పరిక్షలో వి.లౌక్య 10వ తరగతి విద్యార్థిని 3వ స్థానంలో నిలిచిందని, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేతులమీదుగా బహుమతి అందుకుందని ఆయన తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గోలి ప్రభాకర్, డైరెక్టర్ పాపిశెట్టి నర్సింహులు వి.లౌక్యని అభినందించారు. ఈకార్యక్రమంలో అపస్మ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీధర్, అపస్మ సెక్రటరీ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## క్యాన్సర్ రహిత నెల్లూరు కొరకు నారాయణ వైద్యులు ర్యాలీ




**నెల్లూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త -వైద్యం** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నారాయణ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు నారాయణ మెడికల్ కాలేజీ హాస్పిటల్ వారు ఈ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం తరుపున ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం నారాయణ హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ రావులపల్లి మాట్లాడుతూ సామాన్య ప్రజల్లో క్యాన్సర్ వలన కలిగే మరణాల రేటును, ఇబ్బందులను అలాగే క్యాన్సర్ భారినపడకుండా ముందస్తు స్క్రీనింగ్ పరీక్షల గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని, క్యాన్సర్ రోగుల సంఖ్యలో భారతదేశం ప్రపంచంలో మూడవ స్థానంలో ఉందని, అలాగే ఏటా దేశంలో 1.5 మిలియన్ల మంది క్యాన్సర్ భారిన పడుతున్నారని, సరైన జీవనశైలి, ఆహారపు అలవాట్లు లేకపోవడం వలన మగవారు నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, ఆడ వారు రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ల భారిన పడుతున్నారన్నారు. పరిసర జిల్లాల్లో మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ అంకాలజీ రేడియేషన్ అంకాలజి విభాగాలు అన్నీ ఒకే చోట కలిగి, నిష్ణాతులైన వైద్య బృందంతో, అత్యాధునిక పరికరాలు కలిగి, పూర్తి స్థాయి క్యాన్సర్ చికిత్సలు అందిస్తున్న ఏకైక హాస్పిటల్ నారాయణ మాత్రమే అన్నారు. క్యాన్సర్ చికిత్సలకు ఆర్థిక భారం లేకుండా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా పథకం(ఆరోగ్యశ్రీ)లో ఉచితంగా అందిస్తున్నామని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నారాయణ అంకాలజీ విభాగంలోని రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ గురు సాయి రత్న ప్రియ మాట్లాడుతూ క్యాన్సర్ పేషెంట్లకు ఇచ్చే రేడియేషన్ గురించి భయపడాల్సిన అవసరం లేదని క్యాన్సర్ సోకిన ప్రదేశంలో మాత్రమే రేడియేషన్ ఇచ్చే అత్యాధునిక చికిత్సా పద్ధతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి పేషెంట్ ప్రత్యేకం అనే నినాదంతో ఈ సంవత్సరం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని, క్యాన్సర్ భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం నారాయణ ఆంకాలజి విభాగంలోని సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ బి.మనోభిరామ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్యాన్సర్ గురించి అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం జరుగుతుందని, అన్ని రకాల క్యాన్సర్ శస్త్ర చికిత్సలు డాక్టర్ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో ఉచితంగా నారాయణలో చేస్తున్నామని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ హాస్పిటల్ డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.అరుణ్కాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి.ఎం.కార్తీక్, హాస్పిటల్ ఏజీఎం ఏసీ శేఖర్రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ మణిమేఘల, పీఎంపీ జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత : తహశీల్దార్



**కోట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త** రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కోట మండల తహశీల్దార్ కె.జయజయరావు అన్నారు. బుధవారం కోట మండలం చిట్టేడు గ్రామంలో ఎంవి రావు ఫౌండేషన్ 18వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని తహశీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఎంవి రావు ఫౌండేషన్ గత 18 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేయడం ఎంతైనా అభినందనీయమన్నారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ఎం.లీలా మోహన్కృష్ణ, కార్యదర్శి విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు జయంతి, మండల పరిషత్ సూపరింటెండెంట్ శివకుమార్ పాల్గొన్నారు.

## కల్తీ లడ్డు విషయంలో క్లీన్‌చిట్ వచ్చినట్టు వైకాపా తీరు

**కల్తీ రసాయనాలు వాడి భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసిన వైకాపా-అవినీతికి పాల్పడి 234కోట్లను డొల్ల కంపెనీలకు తరలింపు-రాష్ట్ర ప్రజలకు నిజానిజాలు తెలిసేలా జనసేన పోరుబాట**



**నెల్లూరు,ఫిబ్రవరి4 ప్రభాతవార్త-విద్య** భక్తులు ఎంతో పవిత్రంగా స్వీకరించే తిరుమల తిరుపతి దేవస్థాన ప్రసాదం లడ్డు విషయంలో దర్యాప్తు సంస్థలు, కోర్టులు గత వైకాపా ప్రభుత్వానికి క్లీన్‌చిట్ ఇచ్చినట్లు వ్యవహరిస్తూ ప్రజలను , శ్రీవారి భక్తులను తప్పుదారి పట్టిస్తుండటం నీతిమాలిన రాజకీయాలకు పరాకాష్ట అని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో ప్రజలకు నిజానిజాలు తెలిపేందుకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో భక్తులకు, పుర ప్రజలకు శ్రీవారి లడ్డులను ప్రసాదంగా ఇస్తు వాస్తవాలను తెలియజేశారు.ఈ సందర్భంగా గునుకుల మాట్లాడుతు 300 సంవత్సరాలకుపైగా భక్తుల మనోభావాలకు, విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన తిరుమల లడ్డును గత వైకాపా ప్రభుత్వం అసలు పాలేలేని, నెయ్యేకాని, కలుషిత పామాయిల్, రసాయనాలు, వాటి కృత్రిక నెయ్యిని తయారు చేసి స్వామి వారి ప్రసాదంలో వినియోగించటం జరిగిందన్నారు. ఈ అవినీతి చేసి సంపాదించిన 234 కోట్ల రూపాయాల సొమ్మును జగన్ ఆయన డొల్ల కంపెనీలకు తరలించారన్నారు. దేవుడు అంటే నమ్మకం లేని ఇతర మతస్తుల పాలక మండలి వల్లనే ఇంత నీచమైన పరి జరిగిందన్నారు. ఇది కేవలం పరిపాలన సమస్య కాదని, హిందూమతంపై జరిగిన దాడిగా గుర్తించామన్నారు. దేవుడిపై నమ్మకంతో స్వచ్ఛమైన పదార్థాలతో తయారు చేయ్యాల్సిన ప్రసాదాలను ఇటువంటి కల్తీలతో తయారుచేసి భక్తుల ఆత్మవిశ్వాసంతో వైకపా చెలగాటం ఆడుతుందని దుయ్యబట్టారు. సిట్‌కానీ, సిడిఐ కానీ, సుప్రీంకోర్టు గానీ ఎక్కడా కల్తీ జరుగలేదని, వైకాపా కు క్లీన్‌చిట్ ఇవ్వలేదని, ప్రపంచంలో లేని వింతను జగన్ సృష్టించి కృత్రిమనెయ్యితో లడ్డులను తయారు చేసి అందరిని మోసగించారన్నారు. భక్తుల మనోభావాలతో ఆడుకోవటంతో ఎన్నికల్లో 11 సీట్లు వచ్చాయని, అయినా జగన్‌కు బుద్ధి రాలేదన్నారు. కేవలం ప్రజలను మభ్య పెట్టి వాస్తవాలను రూపు మాపేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌ను వైకాపా ఆడుతుందని ధ్వజమెత్తారు. వాస్తవాలను ప్రజలు తెలిపేందుకు జనసేన పోరుబాట చేస్తుందని స్పష్టంచేశారు. ప్రజల మనోభావాలతో చెలగాటం ఆడిన వైకాపాకుపుట్ట గతులు ఉండవన్నారు.ఈ కార్యక్రమలో ఎంఎంసీ డైరెక్టర్ గునుకుల విజయలక్ష్మీ, కోర్ కమిటి సభ్యులు నూనెమల్లిఖార్జుయాదవ్, వీరమహిళలు భవాని, ఆమని, ప్రవల్లిక, సుభాషిని, పద్మజ, నాయుకలు కృష్ణారెడ్డి, శరవణ, గుర్రం కిషోర్‌బాబు, సుధామాదవ్, పెనేటి శ్రీకాంత్, షఫీ, మనోజ్, విశ్వనాధ్, హరి, షాజహాన్ , వెంకటరమణ, గురవయ్య, హర్ష, హంసర్, వర్షన్, వేముల శివకృష్ణ, అశోక్, బాలాజీ, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన డికే విద్యార్థిని



**నెల్లూరు,ఫిబ్రవరి4 ప్రభాతవార్త-విద్య** ఈనెల 5 నుండి 9వ తేదీ వరకు బెంగుళూరులో నిర్వహించనున్న జాతీయాస్థాయి బాక్సింగ్‌టోర్నమెంట్‌లో రాష్ట్ర నుండి ప్రాల్గొనేందుకు నగరంలోని స్థానిక డికే ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రళయ కావేరి కీర్తన ఎంపికైంది. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి మాట్లాడుతు అక్టోబరు నెలలో రాజమండ్రిలో జరిగిన 66,69 కేజీల విభాగం , అండర్19 బాక్సింగ్ పోటీల్లో తమ క్రీడాకారిని పాల్గొని 25 సంవత్సరాల తరువాత జిల్లాకు స్వర్ణపతకం సాధించటం జరిగిందన్నారు. ఇది తమకెంతో గర్వకారణమని కొనియాడారు. ప్రస్తుతం బెంగుళూరులో జరిగే పోటీల్లో కూడా తమ విద్యార్థి విజయం సాధించాలని కోరారు.అ నంతరం విద్యార్థిని, అండర్14 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి, కోచ్ దేవికను పుష్పగుచ్చాలు అందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



**నెల్లూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త -వైద్యం** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన వాక్ - ఏ- థాన్ ఏసీఎస్ఆర్ మెడికల్ కాలేజీ నుండి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఏసీఎస్ఆర్ మెడికల్ కాలేజీ సంయుక్తంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్ష చేయించుకోవాలని, ప్రస్తుతం జిల్లాలో జరు గుతున్న ఎన్‌సీడీ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. తదుపరి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజేశ్వరి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి క్యాన్సర్ కోసం పరీక్షలు చేయించుకోవాలని, అనుమానితులకు జీజీహెచ్‌లోని పీటయులో చికిత్స అందిస్తున్నారని అన్నారు. కాబట్టి ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఏటీఓ డాక్టర్ ఖాదరవల్లి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మస్తాన్ భాషా, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ యశ్వంత్, ఆంకాలజిస్ట్ డాక్టర్ హరిప్రియ, పీఓయు నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ విష్ణు, డీపీఎంఓ డాక్టర్ సునీల్, ఎన్‌సీడీ టీటీటీ డాక్టర్ శాంతి, ఎన్‌సీడీ సెల్ స్టాఫ్, వైద్య ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వార్షికోత్సవ వేడుకలు





**కోవూరు,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** కోవూరులోని రైల్వే రోడ్డులో వెలసి ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో 17వ ప్రతిష్ట వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నందకిషోర్ స్వామి ఆధ్వర్యంలో 108 కలశాలతో అభిషేకం, మండపారాధన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా మహా పూర్ణాహుతి కుంభాభిషేకం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ప్రసాద వితరణ కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటసుబ్బయ్య, కార్యదర్శి ఎస్. రమేష్ బాబు, కోశాధికారి ఎం. రమేష్‌బాబు ఉన్నారు.

## బంగారు చీరతో అమ్మవారు



**కోవూరు,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** కోవూ రులోని రైల్వే రోడ్డులో వెలసి ఉన్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవ స్థానంలో ప్రతిష్ట వార్షికోత్సవం సందర్భం గా బుధవారం అమ్మవారు బంగారు చీరతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాన అర్చకులు నందకిషోర్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– **ఆకట్టుకున్న కోలాటం** ఈ వార్షికోత్సవ సందర్భంగా శ్రీ వాసవీ కోలాట భక్తబృం దం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో చేపట్టిన కోలాటం భక్తులను ఎంతగానో ఆక ర్షించింది. మహిళలు అమ్మవారి పాటలకు లయబద్ధంగా చేపట్టిన కోలాట ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుం ది ఆర్యవైశ్య మహిళా సంఘం నేతలు, దేవస్థాన చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటసుబ్బయ్య, కార్యదర్శి ఎస్. రమేష్ బాబు, కోశాధికారి ఎం. రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

## వ్యక్తి బలవన్మరణం



**నెల్లూరు క్రైం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** అనారోగ్య సమస్యలతో కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన దేవరకొండ సునీల్ కుమార్ (54) అనే వ్యక్తి అదే ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మ రణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన పై సమాచారం అందుకున్న నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్‌బాల్స్ వేయాలి : కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** ప్రతిరోజూ నగరంలో జరుగుతున్న దోమల నివారణ చర్యలలో భాగంగా ఫాగింగ్, స్ప్రేయింగ్‌తో పాటు నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్స్ వేసి కార్యక్రమాలు ఖచ్చితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వై.ఓ.నందన్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం వారాంతపు సమీక్ష సమావేశంలో భాగంగా కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ శానిటేషన్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో శానిటేషన్ సిబ్బందిని ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ నగరంలో 50 పాగింగ్ మిషన్లు, 160స్ప్రేయర్లు, అదనంగా 5 పవర్ స్ప్రేయర్స్ పనిచేస్తున్నాయని నగరంలో వార్డుల వారీగా ఎక్కడెక్కడ నీరు నిల్వ ఉంటుందో అక్కడ తక్షణమే ఆయిల్ బాల్స్ వేసి చర్యలు చేపట్టాలని శానిటేషన్ సిబ్బంది అందరూ సమన్వయంతో ఎంతో ఉన్నతంగా ఆలోచించి అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. నగరంలో పాగింగ్, స్ప్రేయింగ్ ఎక్కడెక్కడ గుర్తించి ఆయా ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. నగరంలో ఇంకా పూడికతీయని కాలువలను గుర్తించి పూర్తి చేయాలని, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, శానిటరీ సూపర్‌వైర్లు వారి వారి పరిధిలో కాలువల పూడికతీత పనులకు పక్కా ప్రణాళిక ప్రకారం గ్యాంగ్ వర్క్ ద్వారా నిర్దేశించిన ప్రదేశాలలో చేపట్టాలని ఆదేశించారు. నిర్దేశించిన పనులన్నింటిని సంబంధిత సానిటీర సూపర్‌వైజర్లు, ఇన్స్పెక్టర్లు సచివాలయ కార్యదర్శులు, మేస్త్రీలు పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. వీటితో పాటు ట్రేడ్ లైసెన్స్ వసూళ్ళ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం డాక్టర్ జిజియా, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మేస్త్రీలు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సుందరీకరణ పనులు పరిశీలించిన కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్ పారిశుధ్య నిర్వహన పనుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం స్థానిక హరనాధపురం కూడలిలో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ఫౌంటెన్, యోగాసన సూర్య నమస్కారాల కళాకృతుల నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర సుందరీకఅణ పనులలో భాగంగా యోగసన సూర్య నమస్కారాలపై ప్రజలకు ఆసక్తిని పెంపొందించే విధంగా కళాకృతులను కూడలిలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిర్మాణపనులను నిర్ధేశించిన సమయంలో వేగవంతంగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకు రావాలని కమిషనర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజ నీరింగ్ విభాగం ఈఈ శేషగిరిరావు, డిఈ ముజాహిద్దీన్, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో ఫిబ్రవరి 9న క్యాంపస్ డ్రైవ్

**కావలి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కావలి పట్టణంలోని ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో మరో కీలక అడుగు వేసింది. ఫిబ్రవరి 9న సోమవారం ఉదయం నుంచి కళాశాల ప్రాంగణంలో ప్రతిష్మాత్మక ఐటి సంస్థ సీఐఎస్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో క్యాంప్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉమ బుధవారం తెలిపారు. ఈక్యాంపస్ డ్రైవ్‌కు 2023, 2024, 2025 ఏడాదిలో డిగ్రీ మరియు బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులతో పాటు ప్రస్తుతం 2026 డిగ్రీ ఫైనల్ ఇయర్ బీటెక్ చదువుతున్న విద్యార్థులు కూడా హాజరుకావచ్చుని తెలిపారు. ఈ అవకాశాన్ని ఎమ్మెస్సార్ డిగ్రీ కాలేజీ విద్యార్థులతో పాటు ఇతర కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగాఈకార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. మరిన్నివివరాలకుకొండపనాయుడు 9000660259, అపర్ణ 9949856734సెల్ నెంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

## రీ సర్వేలో తప్పులు సవరించాలంటూ వినతులు



**దగదర్తి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త** గతంలో జరిగిన రీ సర్వేలో రికార్డు నమోదులో జరిగిన తప్పులను సవరించాలని పలువురు రైతులు ఆర్ఐ ప్రియాంకకు అర్జీలు అందజేశారు. మండలంలోని అనంతవరం గ్రామంలో బుధవారం రెవెన్యూ సమస్యలపై గ్రామసభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రైతుల నుండి అర్జీలు స్వీకరించారు. గ్రామంలో పలు సమస్యలపై 22 అర్జీలు వచ్చాయని, తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఆర్ఐ ప్రియాంక తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు వేణు, దాస్, సర్వేయర్ పవన్ పాల్గొన్నారు.

## నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ట్రిమ్బుల్ టెక్లా సాంకేతిక సదస్సు



**గూడూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** గూడూరు ధుర్జాతినగర్‌లోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ట్రిమ్బుల్ టెక్లా స్టీల్ స్ట్రక్చర్స్, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు కెరీర్ అవకాశాలు అనే అంశంపై మంగళవారం సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోర్ క్రస్ట్ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన సీఈఓ ఎం. వేణుగోపాల్ రెడ్డి, బీడీఎం బి. బాల కోటయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని ట్రిమ్బుల్ టెక్లా సాఫ్ట్‌వేర్ ద్వారా స్టీల్ నిర్మాణాల డిజైన్, డీటైలింగ్, బీఓఎం తయారీ, అంతర్జాతీయ ప్రమాణాలు, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు లభించే ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కళాశాల మేనేజింగ్ సెక్రటరీ వై. వినయ్‌కుమార్, డైరెక్టర్ డా. బి. దత్తాత్రేయ శర్మ, ప్రిన్సిపాల్ డా. కె. విశ్వక్సేన రెడ్డి హాజరై మాట్లాడుతూ, ఆధునిక సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానం నేటి నిర్మాణ రంగంలో అత్యంత అవసరమని, ఇలాంటి సాంకేతిక కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్‌కు దోహదపడతాయని తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి కె. శివకుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేయగా, ఏఓ ఎం. కొండ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విస్తృత ఏర్పాట్లు చేయాలని

### అధికారులకు ఎమ్మెల్యే సూచన



**ముత్తుకూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచించారు. బుధవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నెల్లూరులో అన్ని శాఖల అధికారులతో కలిసి శ్రీ సిద్ధేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్ల ఆవిష్కరణ చేసారు. అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఆలయానికి విద్యుత్ దీపాల అలంకరణ, క్లాత్ పందిర్లు తదితర సౌకర్యాల ఏర్పాటు చేయాలని, వేలాదిగా తరలివచ్చే భక్తులకు అవసరం మేర తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. దేవస్థాన ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని, మూడు రోజులూ భక్తులకు అన్నదానం చేసారు. శ్రీ సిద్ధేశ్వర స్వామి దర్శనానికి వేలాదిగా భక్తులు తరలిరావడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్న నేపథ్యంలో అదనపు భద్రత కల్పించాలన్నారు. పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా, అందుబాటులో ఫైర్ ఇంజన్, అగ్నిమాపక సిబ్బంది, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచడంతో పాటు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించాలని, మద్యం అమ్మకాలపై నిషేధం చేయాలని భక్తుల అవసరాలకు సరిపడా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్పించే సౌకర్యాలపైనా చర్చించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి సూచించారు. ఈ సమీక్ష సమావేశానికి ఆలయ చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, ఆర్డీఓ నాగ అనూష, డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, జిల్లా దేవాదాయ శాఖ అధికారి కోవూరు జనార్దన్ రెడ్డి, తహసీల్దార్ స్వప్న, ఈఓ గిరికృష్ణ, ఎక్సైజ్ డీసీ శంకర్, ఫైర్‌ఆఫీసర్ రాజా, ఎస్సై ప్రసాద్‌రెడ్డి,ఎస్పీడీసీఎల్ ఏడీ రాము, వైద్యాధికారులు సృజన, చందనప్రియ, ఆలయ అర్చకులు నగేష్ శర్మ, టీడీపీ నేతలు మునుకూరు రవికుమార్ రెడ్డి,పగడాలసతీష్,రాగాల శివకృష్ణ,పసుపులేటి గోవిందయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## షబ్ ఎబరాత్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన టౌన్ ఏఎస్పీ



**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, షబ్‌ఎబరాత్ (జాగరణ రాత్రి) సందర్భంగా నెల్లూరు టౌన్‌లో జరుగుతున్న ప్రార్థనా కార్యక్రమాలను టౌన్ ఏఎస్పీ దీక్ష పరిశీలించారు. ఈ సందర్భంగా నెల్లూరు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న మసీదులను సందర్శించి, అక్కడ చేపట్టిన కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు. షబ్‌ఎబరాత్ రంజాన్ మాసానికి సుమారు 15 రోజుల ముందు వచ్చే పవిత్ర జాగరణ రాత్రి కావడంతో, తెల్లవారు జామున పెద్దల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగే నేపథ్యంలో, అక్కడ కూడా భద్రతా చర్యలు కట్టుదిట్టంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యమైన మసీదులు, ప్రార్థనా స్థలాలు, రద్దీ ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పండుగ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక మసీదు కమిటీలు, పెద్దలతో సమన్వయం కొనసాగించాలని పోలీస్ అధికారులకు తెలిపారు. ప్రజలు ఎలాంటి అనుమానాస్పద విషయాలు గమనించినా వెంటనే స్థానిక పోలీసులకు, డయల్ 112కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## గిరిజన కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



**తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త** మండలంలోని నరుకూరు గ్రామానికి చెందిన గిరిజన కుటుంబ సభ్యుడు ఈగ చెంచుకృష్ణయ్య సుమారు ఐదు నెలల క్రితం గంగపట్నంలోని శ్రీ చాముండేశ్వరి అమ్మవారి కోనేరులో స్నానం చేయడానికి దిగి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈగ చెంచుకృష్ణయ్య తెలుగుదేశం పార్టీ సభ్యుడిగా నమోదై ఉన్నాడు. తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు నారా లోకేష్ తీసుకొచ్చిన సభ్యత్వ ప్రమాద బీమా పథకం ప్రకారం, పార్టీ సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఐదు లక్షల రూపాయల బీమా వర్తించే విధంగా ఏర్పాటు చేయబడింది. ఈ పథకం కింద చెంచుకృష్ణయ్య భార్య ఈగ శ్రావణి బ్యాంకు ఖాతాలో టీడీపీ సెంట్రల్ ఆఫీస్ నుంచి ఐదు లక్షల రూపాయలు జమ చేయడం జరిగింది. ఈ ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చేతుల మీదుగా చెంచుకృష్ణయ్య భార్య శ్రావణికి అందజేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, చిన్న వయసులోనే భర్తను కోల్పోయిన శ్రావణికి భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. కుటుంబ పెద్దను కోల్పోవడం తీరని లోటని, పార్టీ అందించిన ఈ ఆర్థిక సహాయం ద్వారా అయినా వారి కుటుంబం కొంతవరకు ఆర్థికంగా నిలబడాలని కోరారు. గిరిజనుల పట్ల ప్రత్యేక ప్రేమాభిమానంతో వ్యవహరిస్తున్న సోమిరెడ్డి, గిరిజనులు చెల్లించాల్సిన వంద రూపాయల టీడీపీ సభ్యత్వ ఫీజును స్వయంగా భరించి, వారికి సభ్యత్వం కల్పించారని స్థానికులు పేర్కొన్నారు. అలాగే చెంచుకృష్ణయ్య కుటుంబానికి బీమా సొమ్ము వచ్చే విధంగా నిరంతరం ప్రయత్నించినందుకు గిరిజనులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరుకూరు ఎంపీటీసీ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షుడు కొణతం రఘుబాబు, కోడూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు రాపర్ల మల్లికార్జున ప్రసాద్ నాయుడు (బాబు నాయుడు), మల్లికార్జున పురం మాజీ సర్పంచ్ తాళ్లూరి వెంకట రమణయ్య, జీవరత్నం అనిల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## నారాయణలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు



**నెల్లూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త -వైద్యం** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నారాయణ మెడికల్ కాలేజీ హాస్పిటల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ ఆంకాలజి విభాగంలోని మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎన్.శ్రీవిద్య మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా నారాయణ హాస్పిటల్లో అనేక రకాల జబ్బులకు చికిత్సలు అందిస్తున్నారని, అయితే గత సంవత్సరం నుండి క్యాన్సర్ చికిత్సలను కూడా ప్రారంభించడం జరిగిందని, ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఈ రోజు నుండి మార్చి 4వ తేదీ వరకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. 20 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళా మూడేళ్ల కు ఒక సారి, 40 సంవత్సరాలు దాటిన వారు ప్రతి రెండేళ్లకు ఒక సారి అలాగే 50 ఏళ్లు దాటిన వారు ఏడాదికి ఒక సారి మామోగ్రామ్, పాప్స్మియర్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ గురుసాయి రత్న ప్రియ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీన వరల్డ్ క్యాన్సర్‌డేగా జరుపుకుంటారని, ఈ సంవత్సరం థీమ్ యునైటెడ్ బై యునిక్యు అనగా ప్రతి పేషెంట్ వారికి వచ్చిన క్యాన్సర్‌ను బట్టి భిన్నంగా ఉంటుందని, ఇప్పటికి క్యాన్సర్ గురించి అనేక అపోహాలు భయాలు ఉన్నాయని, ఇటీవల భారతదేశంలో ఎక్కువగా వినిపిస్తున్న ఆరోగ్య సమస్యల్లో క్యాన్సర్ ఒకటని, విదేశాలతో పోల్చుకుంటే 75శాతం మంది అడ్వాన్స్డ్ స్టేజ్‌లో చికిత్స కొరకు వస్తున్నారని, దీనికి కారణం ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు, వ్యాక్సినేషన్ గురించి అవగాహన లేకపోవడమే అన్నారు. అలా కాకుండా ముందుగానే గుర్తిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చని, క్యాన్సర్ వస్తే జీవితం క్యాన్సిల్ కాదన్నారు. క్యాన్సర్‌కు అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ఆర్థిక భారం లేకుండా ఆరోగ్యశ్రీలో చికిత్సలు పొందే అవకాశం ఉందని, 30 సంవత్సరాలు పైబడి వారందరూ మార్చి 4వ తేదీ వరకు అందుబాటులో ఉన్న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ బి.మనోభిరామ్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను మొదటి లేదా రెండవ దశలలో గుర్తించి శస్త్ర చికిత్సతో పూర్తిగా తొలగిస్తే నయమయ్యే శాతం చాలా ఎక్కువగా ఉంటుందని, అలాగే పేషెంటుకు ఎక్కువ నొప్పి, బాధ లేకుండా త్వరగా నయమవుతుందని, ఇందుకు అవసరమైన అత్యాధునిక శస్త్ర చికిత్సా పద్ధతులు నారాయణ హాస్పిటల్లో అందుబాటులో ఉన్నాయని, శస్త్ర చికిత్స అనంతరం కూడా కీమోథెరపి రేడియేషన్ థెరపీ అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా పొందే అవకాశం అందుబాటులో ఉందన్నారు. అనంతరం నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.ప్రభావతి క్యాన్సర్ లక్షణాల గురించి, నారాయణ హాస్పిటల్లో అందుబాటులో ఉన్న చికిత్సా పద్ధతుల గురించి, ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకు చేసే స్క్రీనింగ్ పరీక్షల గురించి వివరించారు. అనంతరం అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ రావులపల్లి మాట్లాడుతూ గతంలో క్యాన్సర్ చికిత్సలు మెట్రోపాలటన్ నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండేవని, అయితే ఫౌండర్ చైర్మన్ నారాయణ ఈ ప్రాంత ప్రజలకు క్యాన్సర్ చికిత్సలు కూడా అదించాలనే ఉద్దేశంతో గత సంవత్సరం ఈ సేవలను ప్రారంభించడం జరిగిందని, ఆరోగ్యశ్రీ సదుపాయం కూడా అందుబాటులో ఉందని, మెడికల్ సర్జికల్, రేడియేషన్ అంకాలజి సేవలు అందుబాటులో ఉన్నాయని, ఈ వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా ఈ రోజు నుంచి నెల రోజుల పాటు సుమారు రూ.5000 ఖరీదు చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీని ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ రావులపల్లి వైద్యులతో కలిసి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీ పోస్టర్‌ను విడుదల చేశారు. క్యాన్సర్ అవగాహన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి, సిబ్బంది, క్యాన్సర్ పేషెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



**కోవూరు,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** కోవూరులోని బీసీ వసతి గృహంలో కుక్‌గా పనిచేస్తున్న వై. బుజ్జమ్మకు ఇటీవల రిపబ్లిక్‌డే పర్వదినం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గణతంత్ర అవార్డు లభించింది. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని సంక్షేమ అధికారిణి సుమలత కుక్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యమ్రంలో వసతి గృహ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.